ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

## రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 27 | పేజీలు: 6 | వెల: రూ.3/- | సోమవారం 11 మే 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# రాజకీయ జుగల్బందీకి 'సింధు' వేదిక

### మూడు పార్టీలు.. ముచ్చటైన ఒకే ప్లాన్!.. బీఆర్ఎస్ భూమి.. కాంగ్రెస్ లీజు.. బీజేపీ రిబ్బన్ కట్

### హైటెక్ సిటీ సాక్షిగా సాగుతున్న విచిత్ర రాజకీయ సమన్వయం

**శేరిలింగంపల్లి : మే 10, (ప్రభాత ఉదయం)**

తెలంగాణ రాజకీయాలంటే కేవలం విమర్శలు ప్రతివిమర్శలే అనుకుంటే పొరపాటే. మైకుల ముందు కత్తులు దూసుకునే నాయకులు తెర వెనుక ఎంతటి 'విశ్వ మానవ సౌభాతృత్వం' ప్రదర్శిస్తారో చెప్పడానికి హైటెక్ సిటీలో వెలిసిన 'సింధు క్యాన్సర్ హాస్పిటల్' ఒక అద్భుత నిదర్శనం. అక్షరాలా వేల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తి విషయంలో రాష్ట్రంలోని మూడు ప్రధాన పార్టీల మధ్య కనిపిస్తున్న ఈ 'అపూర్వ సంగమం' చూసి రాజకీయ విశ్లేషకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

**నాడు 'అక్రమం'.. రేవంత్ నేడు 'అవసరం'!**

గులాబీ గూడులో బీజం: 2018లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఖానామెట్‌లో సుమారు రూ. 1500 కోట్ల విలువైన 15 ఎకరాల ప్రభుత్వ భూమిని కేవలం ఏడాదికి రూ. 1.50 లక్షల స్వల్ప అద్దెకు 'సాయి సింధు ఫౌండేషన్'కు కట్టబెట్టింది. హెటెరో పార్థసారథి రెడ్డికి రాజ్యసభ బెర్త్ దక్కడం ఈ భూ కేటాయింపు జరగడం వెనుక ఉన్న స్క్రీన్‌ప్లే అప్పట్లో సంచలనం సృష్టించింది.

అప్పట్లో విపక్ష నేతగా ఉన్న రేవంత్ రెడ్డి దీనిపై నిప్పులు చెరిగారు. ఇది భారీ స్కామ్ అని అధికారంలోకి రాగానే బాధ్యులను జైలుకు పంపుతామని గర్జించారు. అన్నట్టుగానే అధికారంలోకి వచ్చాక తొలుత ఆ భవనాన్ని సీజ్ చేశారు.





కానీ కాలం గడిచేకొద్దీ అక్రమం కాస్తా 'అవసరం'గా మారిపోయింది. తాజా జీవోతో అదే భూమికి లీజును ఖరారు చేస్తూ కాంగ్రెస్ సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. రాజకీయ వ్యూహంలో అసలైన ట్విస్ట్ బీజేపీ రూపంలో వచ్చింది. బీఆర్ఎస్ నేత కట్టిన ఆసుపత్రికి కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతులు ఇస్తుంటే దానిని ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభించడం విశేషం. వేదిక మీద ముగ్గురు ప్రత్యర్థులు చిరునవ్వులతో కనిపిస్తుంటే కింది స్థాయిలో కార్యకర్తలు మాత్రం సోషల్ మీడియాలో ఎవరు ఎవరితో కలిశారో అర్థం కాక జుట్టు పట్టుకుంటున్నారు. ఈ 15 ఎకరాల భూమి విలువ బహిరంగ మార్కెట్ లో సుమారు రూ. 1500 కోట్లు

బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఏడాదికి కేవలం రూ. 1.50 లక్షలకే లీజు కేటాయించింది. గతంలో కాంగ్రెస్ వ్యతిరేకించినా ఇప్పుడు లీజు క్రమబద్ధీకరిస్తు జీఓను విడుదల చేసింది.

ప్రధాని చేతుల మీదుగా గ్రాండ్ ఓపెనింగ్ చేడంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తి చేస్తున్నారు.

అసలు సిసలు కో-ఆపరేటివ్ ఫెడరలిజం అంటే ఇదేనేమోనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం పడుతున్నారు. పార్టీలు వేరైనా ప్లాన్ ఒక్కటే అన్నట్టుగా సాగుతున్న ఈ రాజకీయ భేతాళ కథలో లబ్ధిదారులు ఎవరో సామాన్యులకు అర్థమవుతూనే ఉంది. నాయకుల మాటలు పట్టుకుని కార్యకర్తలు కొట్టుకోవద్దు ఎందుకంటే పెద్దల గూడుపుఠాణీలు.. ఆలోచనలు ఎప్పుడూ ఇలాగే హైటెక్ గా ఉంటాయి.







## సైబరాబాద్ అతి పెద్ద
# ఉపాధి కేంద్రంగా మారింది

### దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోంది : ప్రధాని మోదీ

### రాష్ట్రాల అభివృద్ధి లేనిదే దేశాభివృద్ధి సాధ్యం కాదన్న ప్రధాని మోదీ

### తెలంగాణ వికసిస్తే దేశం కూడా వికసిస్తుందని వ్యాఖ్య

### తెలంగాణలో రూ. 9,400 కోట్ల అభివృద్ధి పనులు

**హైదరాబాద్, మే 10 (ప్రభాత ఉదయం)**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ వేదికగా తెలంగాణలో సుమారు రూ. 9,400 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీ, పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా పాల్గొన్నారు. హైదరాబాద్-పనాజీ ఎకనామిక్ కారిడార్: ఇందులో భాగంగా సూరారం నుంచి మహబూబ్‌నగర్ వరకు రూ. 3,180 కోట్లతో 84 కిలోమీటర్ల మేర నాలుగు వరుసల రహదారి నిర్మాణ పనులు. కాజీపేట-విజయవాడ మల్టీ-ట్రాకింగ్: ఈ ప్రాజెక్టులో భాగంగా రూ. 1,200 కోట్లతో నిర్మించిన 118 కిలోమీటర్ల రైల్వే లైన్లను జాతికి అంకితం చేశారు.

కాజీపేట రైల్ అండర్ బైపాస్: కాజీపేట జంక్షన్‌లో రైళ్ల రాకపోకలను సులభతరం చేసేందుకు రూ. 2,300 కోట్లతో నిర్మించిన 21 కిలోమీటర్ల బైపాస్‌ను ప్రారంభించారు.

గ్రీన్‌ఫీల్డ్ పీఓఎల్ టెర్మినల్: మల్కాపూర్‌లో ఇండియన్ ఆయిల్ ఆధ్వర్యంలో నిర్మించిన గ్రీన్‌ఫీల్డ్ పెట్రోలియం, ఆయిల్, లూబ్రికెంట్స్ (పీఓఎల్) టెర్మినల్‌ను ప్రారంభించారు. పీఎం మిత్ర పార్క్: వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో రూ. 1,700 కోట్లతో ఏర్పాటు చేయనున్న పీఎం మిత్ర పార్కుకు శంకుస్థాపన ..మిగతా 2లో

## తెలంగాణలోనూ అధికారంలోకి వస్తాం: మోదీ



**హైదరాబాద్, మే 10 (ప్రభాత ఉదయం)**

పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ పార్టీ తొలిసారి అద్భుత విజయం సాధించిందని, తెలంగాణలోనూ బెంగాల్ పరిస్థితులు కనిపిస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. తెలంగాణలోనూ అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే తెలంగాణలోనూ అధికారంలోకి వస్తామనే నమ్మకం కలిగిందని సంతోషం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు బీజేపీ పాలన కోరుకుంటున్నారని అన్నారు. ఆదివారం ..మిగతా 2లో

# మోదీ ఆశీర్వాదం ఉంటే తెలంగాణ వేగంగా అభివృద్ధి

### సీఎం రేవంత్ రెడ్డి

### హెచ్ఐసీసీలో ప్రధాని మోదీ చేతుల మీదుగా వర్చువల్‌గా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు

### కార్యక్రమంలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, మే 10 (ప్రభాత ఉదయం)**

ఇది కేవలం కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం కాదని, ఇది అభివృద్ధి ఉత్సవమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ముందుకెళ్లేందుకు అవసరమైన అభివృద్ధి ఉత్సవమని, ప్రధాని ప్రణాళిక అయిన వికసిత్ భారత్‌తో కలిసి నడుస్తామని ప్రకటించారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో ప్రధాని మోదీ చేతుల మీదుగా వర్చువల్‌గా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానితో పాటు రేవంత్ రెడ్డి పాల్గొని మాట్లాడారు.

తెలంగాణ ప్రాజెక్టులపై మోదీ దృష్టి సారించాలి : ఐదు రాష్ట్రాల ఎన్నికలు పూర్తయిపోయాయని, ఇప్పుడు రాజకీయాలు మాట్లాడాల్సిన పని లేదని రేవంత్ పేర్కొన్నారు. అభివృద్ధి గురించే మాట్లాడదామని వ్యాఖ్యానించారు. 2047 నాటికి భారత్ ..మిగతా 2లో

## కార్యకర్తలు, అభిమానుల కేరింతల నడుమ..
# సీఎంగా విజయ్ ప్రమాణం

### 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు దస్త్రంపై తొలి సంతకం

### కేబినెట్‌లోకి 9 మంది.. వేడుకకు హాజరైన రాహుల్ గాంధీ

### ప్రత్యేక ఆకర్షణగా నటి త్రిష

**చెన్నై, మే 10 (ప్రభాత ఉదయం )**

కిక్కిరిసిన జనం.. అభిమాన గణం.. కార్యకర్తలు.. అందరిలోనూ ఒకటే ఉత్సాహం. తాము ఎంతగానో ప్రేమించే నటుడు, నాయకుడు.. సీఎంగా ప్రమాణం చేయబోతున్నారనే ఆనందం. ఆ క్షణాలను తనివితీరా చూసి.. ఆ అపురూప దృశ్యాన్ని మనసుల్లో కలకాలం నిలుపుకోవాలనే తపన..

..మిగతా 2లో



# సామాన్యుడి కుమారుడికైనా.... కేంద్ర మంత్రి కుమారుడికైనా ఒకటే చట్టం

### మాజీ హోంశాఖమంత్రి సబితాఇంద్రారెడ్డి.

### తెలంగాణలో క్షీణించిన శాంతి భద్రతలు.

### హోం మంత్రి భాద్యతలను విస్మరిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి.

### రాష్టంలో పట్టపగలు హత్యలు.. దోపిడీలు

### ప్రతిపక్ష నాయకులను వేదించడం తప్ప... నేరాలపై నిఘా ఏది.

### మాజీ హోంశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

**హైదరాబాద్, మే 10 (ప్రభాత ఉదయం )**

సామన్యుడి కుమారుడైన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కుమారుడికైన చట్టం ఒకటేనని బి ఆర్ ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ మాజీ హోంశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణ రాష్టంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు హైదరాబాద్ కు వచ్చిన వేళ రాష్ట్రంలో సంచలనంగా మారిన కేద్రం హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడిపై వచ్చిన అభియోగాలు, నమోదైన పోక్సో చట్టం, తెలంగాణ రాష్టం లో గాడితప్పిన శాంతి భద్రతలపై ఆదివారం బి ఆర్ ఎస్ మహిళా నాయకురాలతో కలసి బి ఆర్ ఎస్ భావనంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.... రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా గాడితప్పాయని ఆరోపించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడిపై నమోదైన పొక్సో కేసుపై స్పందిస్తూ... సామాన్యుడి కుమారుడైన, ..మిగతా 2లో





### పేరుకు జాతీయ పార్టీ నాయకులు
## లక్ష్యం అంతా వసూళ్ళు కోసం
# బెదిరింపులు

### ఐడిఎ బొల్లారం లో ఇద్దరు నాయకులతో కలిసి మరో వ్యక్తి చేస్తున్న వసూళ్ళు, బెదిరింపులపై పారిశ్రామిక వర్గాలతో పాటు సర్వత్రా విస్మయం

### అంతా తెలిసి కూడా పార్టీ అధిష్టానం మౌనం

**పటాన్ చెరు, మే 10 (ప్రభాత ఉదయం):**

అదో జాతీయ పార్టీ.. ఏ పార్టీ అయినా పార్టీ బలోపేతానికి పాటు పడే వ్యక్తులు నాయకులుగా ఉండాలని ఆశిస్తూ ఉంటుంది. కానీ ఐడిఎ బొల్లారంలో మాత్రం ఓ పార్టీ నాయకులు బెదిరింపులకు దిగి, బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలిసి కూడా అధిష్టానం మౌనం వహించడం స్థానికులను విస్మయానికి ..మిగతా 2లో

# సైబరాబాద్ అతి పెద్ద ఉపాధి కేంద్రంగా మారింది

మొదటి పేజీ తరువాయి...

చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. "నేటి భారత్ 'రిఫార్మ్స్ ఎక్స్‌ప్రెస్' మీద నడుస్తోంది. అదే సమయంలో ఆధునిక మౌలిక సదుపాయాలను కూడా వేగంగా నిర్మిస్తోంది. ఈ రోజు శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులు వేలాది ఉద్యోగ అవకాశాలను సృష్టిస్తాయి, తెలంగాణ కనెక్టివిటీని మరింత బలోపేతం చేస్తాయి" అని మోదీ అన్నారు. "ఒకప్పుడు ప్రపంచంలో భారత్ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్నప్పుడు, మన టెక్స్‌టైల్ పరిశ్రమ కీలక పాత్ర పోషించింది. ఇప్పుడు వరంగల్‌లోని పీఎం మిత్ర పార్క్ దేశంలో టెక్స్‌టైల్ విప్లవాన్ని వేగవంతం చేస్తుంది" అని ఆశాభావం వ్యక్తం చేశారు.

"గత 12 ఏళ్లుగా ఆధునిక కనెక్టివిటీకి మా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. రోడ్లు, రైల్వేలు, విమానాశ్రయాలు... ఇలా ప్రతి రవాణా మార్గంపై అపూర్వమైన పెట్టుబడులు పెడుతున్నాం. గత 11 ఏళ్లలో తెలంగాణలో జాతీయ రహదారుల నెట్‌వర్క్ రెట్టింపు అయింది. కేవలం జాతీయ రహదారుల కోసమే సుమారు రూ. 1.75 లక్షల కోట్లు పెట్టుబడి పెట్టాం" అని



వివరించారు.

రైల్వే బడ్జెట్‌పై మాట్లాడుతూ, "ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు రైల్వే బడ్జెట్ రూ. 1,000 కోట్ల కంటే తక్కువగా ఉండేది. కానీ నేడు ఒక్క తెలంగాణకే ఈ ఏడాది రూ. 5,500 కోట్ల బడ్జెట్ కేటాయించాం. ప్రస్తుతం రాష్ట్రంలో రూ. 50,000 కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి" అని తెలిపారు.

ప్రపంచంలో ఇంధన భద్రత ప్రాముఖ్యత పెరిగిందని, అందుకే తమ ప్రభుత్వం దీనిపై భారీగా పెట్టుబడులు పెడుతోందని చెప్పారు. సౌరశక్తిలో భారత్ ప్రపంచంలోనే అగ్రగామి దేశాల్లో ఒకటిగా నిలిచిందని అన్నారు. "ఈ మౌలిక సదుపాయాల కోసం కేంద్ర ప్రభుత్వం వేల కోట్లు పెట్టుబడి పెడుతోంది. ఇది తెలంగాణ యువతకు కొత్త ఉపాధి అవకాశాలను సృష్టిస్తుంది. తెలంగాణలోని ప్రతి కుటుంబ సభ్యుని కలలను నెరవేర్చడానికి కేంద్ర ప్రభుత్వం మరింత వేగంతో పని చేస్తుందని హామీ ఇస్తున్నాను" అని ప్రధాని తన ప్రసంగాన్ని ముగించారు.

# తెలంగాణలోనూ అధికారంలోకి వస్తాం: మోదీ

మొదటి పేజీ తరువాయి...

సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో బీజేపీ భారీ బహిరంగ సభ నిర్వహించింది. ఈ బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'సుపరిపాలనతోనే దేశ ప్రజలు బీజేపీని ఆదరిస్తున్నారు. అబ్ కీ బార్ తెలంగాణ మే బీజేపీ సర్కార్. అసోంలో మూడోసారి అధికారంలోకి వచ్చాం. కాంగ్రెస్ ఎక్కడ అధికారంలో ఉంటే అక్కడ అవినీతే. బెంగాల్ ప్రజలు టీఎంసీ, లెఫ్ట్ పార్టీలను తిరస్కరించారు. మమత నియంతృత్వాన్ని బెంగాల్ ప్రజలు ఎదిరించారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో బీజేపీ విస్తరిస్తోంది. కుటుంబ పాలన, వారసత్వ రాజకీయాలు కాదు.. విశ్వాస రాజకీయాలను ప్రజలు నమ్ముతున్నారు. పదేళ్ల క్రితం బెంగాల్‌లో ముగ్గురు ఎమ్మెల్యేలే ఉన్నారు. ఇప్పుడు 200 మందికి పైగా ఎమ్మెల్యేలు ఉన్నారు'..

'ఒకప్పుడు బీజేపీకి రెండే ఎంపీ సీట్లు ఉండేవి. అందులో ఒకరు తెలంగాణ వ్యక్తి. తెలంగాణకు వేల కోట్ల నిధులు ఇస్తున్నాం. జహీరాబాద్‌లో ఇండస్ట్రియల్ కారిడార్‌ను ఏర్పాటు చేస్తున్నాం. కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనను తెలంగాణ ప్రజలు నమ్మడం లేదు. హైదరాబాద్‌ను అన్ని రకాలుగా కేంద్రం అభివృద్ధి చేస్తోంది' అని అన్నారు.

**కాంగ్రెస్ మూడు రాష్ట్రాల్లోనే అధికారంలో ఉంది**

మోదీ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. 'కాంగ్రెస్ మూడు రాష్ట్రాల్లోనే అధికారంలో ఉంది. కాంగ్రెస్ ఎక్కడ అధికారంలో ఉన్నా.. అబద్ధాలతోనే పాలన సాగిస్తోంది. హామీలతో ఆకాశానికి ఎత్తి తర్వాత మోసం చేస్తారు. కాంగ్రెస్ మావోయిస్టు పార్టీగా మారింది. ముస్లింలీగ్ మావోయిస్టు కాంగ్రెస్‌గా మారింది. మావోయిస్టుల హింసతో తెలంగాణ తీవ్రంగా నష్టపోయింది. దేశమంతా మావోయిస్టులు అంతమైనా తెలంగాణలో ఇంకా ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులకు స్వేచ్ఛ ఇవ్వడం లేదు. తెలంగాణలో మావోయిస్టులను అంతం చేయాలంటే బీజేపీ పాలన రావాలి'..

'ప్రపంచం ఎన్నో సవాళ్లు, సంక్షోభాలను ఎదుర్కొంటోంది. పశ్చిమాసియా, ఉక్రెయిన్ యుద్ధాతో సప్లయ్ చైన్ దెబ్బతింది. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం దేశంపై తీవ్రంగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్, యూరియా ధరలు అమాంతం పెరిగాయి. రెండు నెలల నుంచి ప్రజలపై భారం పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. యుద్ధం కారణంగా వచ్చే నష్టాన్ని కేంద్రమే భరిస్తోంది. ధరలను పెంచడం లేదు, ప్రజలపై భారం వేయడం లేదు. క్లిష్ట సమయంలో దేశ ప్రజలకు నా వినతి. పెట్రోల్, డీజిల్ పరిమితంగా వినియోగించండి. విదేశీ మాదకద్రవ్యాన్ని మనం కాపాడుకోవాలి. ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించాలి. వర్క్‌ఫ్రమ్ హోమ్, ఆన్‌లైన్ మీటింగ్‌లు పెట్టుకోవాలి. ప్రజా రవాణాను వినియోగించాలి. మధ్యతరగతి ప్రజలు ఖర్చులు తగ్గించుకోవాలి. మధ్యతరగతి ప్రజలు విదేశీ ప్రయాణాలు మానుకోవాలి' అని అన్నారు.

# మోదీ ఆశీర్వాదం ఉంటే తెలంగాణ వేగంగా అభివృద్ధి

మొదటి పేజీ తరువాయి...

30 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యంగా పెట్టుకున్నామని గుర్తు చేసిన ఆయన, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీని తెలంగాణ లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. 2034 నాటికి తెలంగాణ ట్రిలియన్ డాలర్ల ఎకానమీ సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మోదీ ఆశీర్వాదం ఉంటే తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతుందని, కేంద్ర మంత్రులను తాను తరచూ కలుస్తుంటానని అన్నారు. కొన్ని పనులు అయ్యాయని, ఇంకొన్ని పనులు కావాల్సి ఉన్నాయని మోదీ దృష్టికి తెచ్చారు. తెలంగాణ కూడా మిగిలిన రాష్ట్రాల్లా అభివృద్ధి చెందాలని, తెలంగాణ ప్రాజెక్టులపై మోదీ దృష్టి సారించాలని కోరారు. దేశానికి 10 శాతం జీడీపీ ఇస్తామని వాగ్దానం చేస్తున్నామని, మోదీకి విశాల హృదయం ఉందని కిషన్‌రెడ్డి చెబుతుంటారని, మోజీ తెలంగాణ పెండింగ్ ప్రాజెక్టులకు సహకరిస్తే వేగంగా అభివృద్ధి చెందుతామని అన్నారు.

నగరాలను కేంద్రం ప్రోత్సహించాలి : దేశ జనాభాలో





తెలంగాణ 3 శాతం వాటా కలిగి ఉందన్న సీఎం, దేశ జీడీపీకి తెలంగాణ 5 శాతం వాటా ఇస్తోందని గుర్తు చేశారు. 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను కేంద్రం లక్ష్యంగా పెట్టుకుందని, 30 ట్రిలియన్ డాలర్లలో తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల వాటా ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. దేశ జీడీపీకి 10 శాతం వాటా ఇవ్వాలనే లక్ష్యంతో సాగుతున్నామని, దేశాభివృద్ధిలో ఆరు మహానగరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. దిల్లీ, ముంబయి, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్ కీలక పాత్ర పోషిస్తున్నాయని, దేశానికి సింహభాగం ఆదాయం ఇస్తున్న ఆరు నగరాలను కేంద్రం ప్రోత్సహించాలని ప్రధానిని కోరారు.

మోదీ సహకరించాలి : రాష్ట్ర పెండింగ్ ప్రాజెక్టులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, తెలంగాణ ప్రాజెక్టులపై 2 గంటలు కేటాయించి సమీక్షించాలని మోదీకి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మెట్రో విస్తరణ, ఫ్యూచర్ సిటీ, రీజనల్ రింగ్ రోడ్, మూసీ ప్రాజెక్టు, రేడియల్ రోడ్లు, హైదరాబాద్ - మచిలీపట్నం వరకూ 12 లైన్ల ఎక్స్‌ప్రెస్ హైవేకు సహకరించాలని కోరారు.

"ఐదు రాష్ట్రాల ఎన్నికలు పూర్తయిపోయాయి. ఇప్పుడు రాజకీయాలు మాట్లాడాల్సిన పని లేదు. అభివృద్ధి గురించే మాట్లాడదాం. మోదీ ఆశీర్వాదం ఉంటే తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతుంది. కేంద్ర మంత్రులను నేను తరచూ కలుస్తుంటాను. కొన్ని పనులు అయ్యాయి. ఇంకొన్ని పనులు కావాల్సి ఉన్నాయి. తెలంగాణ కూడా మిగిలిన రాష్ట్రాల్లా అభివృద్ధి చెందాలి. తెలంగాణ ప్రాజెక్టులపై మోదీ దృష్టి సారించాలి" - రేవంత్ రెడ్డి, తెలంగాణ సీఎం

# పేరుకు జాతీయ పార్టీ నాయకులు
# లక్ష్యం అంతా వసూళ్ళు కోసం బెదిరింపులు

మొదటి పేజీ తరువాయి...

గురిచేస్తోంది. బొల్లారం డివిజన్ పరిధిలో ఈ మధ్య కాలంలో పుంజుకుంటూ, కొద్ది కొద్దిగా బలం పెంచుకుంటున్న నేపథ్యంలో ఆ జాతీయ పార్టీ లోని ఇరువురు నాయకులు మరో వ్యక్తితో కలిసి చేస్తున్న ఘన కార్యాల పుణ్యమాని ఆ పార్టీ ప్రతిష్ట రోజురోజుకూ దిగజారిపోతోందని ఆ పార్టీలో నిబద్ధత కలిగిన కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో పారిశ్రామిక ప్రాంతంలో వీరు కొంతమంది పారిశ్రామిక వేత్తలతో బెదిరింపులకు దిగినట్లు తెలుస్తోంది. ఇటీవల ఓ పరిశ్రమలో ప్రమాదం జరిగిందని తెలుసుకున్న వీరు తమకు మామూళ్లు ఇవ్వాల్సిందేనని ఆ పరిశ్రమ ప్రతినిధులపై బెదిరింపులకు దిగినట్లు విశ్వసనీయ సమాచారం. అంతేకాకుండా ఓ ప్రభుత్వ భూమిని కబ్జా చేసి నిర్మాణం చేస్తున్న వ్యక్తులను బెదిరించి లక్షల రూపాయలు వసూలు చేసిన సంగతి బహిరంగ రహస్యమే. అదేవిధంగా కొన్ని నిర్మాణాల విషయంలో వారు బెదిరింపులకు దిగినట్లు నిర్మాణదారులు ఆ పార్టీ ముఖ్య నేతలకు మౌఖిక ఫిర్యాదులు చేసినట్లు వినికిడి. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, ప్రజానీకానికి సహాయసహకారాలు అందించి వారి మన్ననలు పొందాల్సిన నాయకులు ఆ ప్రజలనే ఇబ్బందులకు గురి చేయడం వల్ల ఆ పార్టీ పట్ల వ్యతిరేక భావం పెరుగుతుంది అనే విషయం తెలిసి కూడా అధిష్టానం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనుక ఏదో మర్మం దాగి ఉందని పార్టీ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. బెదిరింపులకు దిగటం జన్మహక్కులా భావించి ఈ తరహా చేష్టలతో పార్టీ ప్రతిష్ట మంట కలుపుతున్నారని ఆ పార్టీలోని కొందరు వాపోతున్నారు. సమస్యలు ఉంటే సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చి పిర్యాదు చేయాలి తప్ప బెదిరింపులకు దిగి, పైసలు వసూళ్ళు చేసుకుంటే అన్యాయం న్యాయం అయిపోతుందా అని ఆ పార్టీలోని కొందరు నేతల నుంచే ఇలాంటి ప్రశ్నలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ విషయం గురించి ఆ పార్టీ జిల్లా నాయకులకు పిర్యాదు చేసేందుకు బాధితులు సన్నద్ధంగా ఉన్నట్లు సమాచారం. విషయం తెలుసుకున్న తర్వాత అయినా పార్టీ నాయకత్వం వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటుందో ఎదురు చూడాల్సిందే.

# గద్వాల జిల్లాలో వేసవి
# ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరం ప్రారంభం

గద్వాల జిల్లా ప్రతినిధి,మే10(ప్రభాత ఉదయం)

హెచ్ సి ఏ సౌజన్యంతో ఎండిసి ఏ ఆధ్వర్యంలో జోగులాంబ గద్వాల జిల్లాలో ఈ నెల 12 తేదీ నుంచి జూన్ 10 వరకు వేసవి ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు. అసోసియేషన్ ప్రెసిడెంట్ శరత్ చంద్ర. ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ వెల్లడించారు. ఇండోర్ స్టేడియంలో గద్వాల శ్రీనివాస్. 7780690883 గద్వాల పట్టణంలోని ఇండోర్ క్రికెట్ మైదానంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గద్వాల జిల్లాలో ఉన్న గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గద్వాలలో 12 వ తేదీనా పట్టణంలో వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభమవుతాయని చెప్పారు. ఆ కేంద్రంలో నిష్ణాతులైన కోచులు శిక్షణ అందిస్తారని, క్రీడాకారులకు జంబో కిట్, వివిధ రకాల బాల్స్, ఫిజికల్ ఫిట్నెస్ కిట్లు అందజేస్తామన్నారు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు కోచింగ్ ఉంటుందని, క్రీడాకారులకు అల్పాహారం అందిస్తామన్నారు. అండర్- 14, 16, 19, 23 విభాగాల క్రీడాకారులకు ఉచిత శిక్షణ ఉంటుందన్నారు.వేసవి శిక్షణ శిబిరాల్లో ప్రతిభగల గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. వేసవి శిక్షణ శిబిరాలను ఔత్సాహిక క్రీడాకారులు సద్వినియోగం చేసుకొని తమ నైపుణ్యాన్ని చాటుకోవాలని సూచిం చారు. రిషేంద్ర మహమ్మద్ ఖయ్యూం.శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటారు..



# మోదీ 'జనాగ్రహ సభ'కు తరలివెళ్లిన జిల్లా బిజెపి శ్రేణులు

గద్వాల జిల్లా ప్రతినిధి, మే 10(ప్రభాత ఉదయం)

ప్రధాని మోదీ 'జనాగ్రహ సభ'కు గద్వాల జిల్లా బిజెపి శ్రేణులు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు.అదివారం సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో బీజేపీ పార్టీ ఆధ్బర్యంలో నిర్వహించనున్న భారత ప్రధాని నరేంద్ర మోదీ 'జనాగ్రహ సభ'కు కేటీదొడ్డి మండల నుండి భారీ ఎత్తున బిజెపి శ్రేణులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా కేటిదొడ్డి మండల కేంద్రం నుండి వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు 4 ఆర్టీసీ బస్సులలో తరలివెళ్లారు. ఈ సందర్భంగామండలాధ్యక్షుడు శ్రీపాద రెడ్డి మాట్లాడుతూ... పాలమూరు ఎంపీ డీకే అరుణ ఆదేశాల మేరకు సికింద్రబాద్ లో నిర్వహించనున్న జనాగ్రహ సభకు బీజేపీ శ్రేణులు తరలివెళ్లినట్లు వెల్లడించారు. దేశాభివృద్ధిలో ప్రధాని మోదీ నాయకత్వాన్ని బలపరచడానికి మరియు రాష్ట్రంలో బిజెపి బలాన్ని చాటడానికి ఈ సభ ఎంతో కీలకమని పేర్కొన్నారు.జనాగ్రహ సభకు తరలివెళ్లిన ఊరిలో బీజేపీ పార్టీ సీనియర్ నాయకులు బీమ్ రెడ్డి, హన్మిరెడ్డి,చైర్మన్ కరెప్ప, తిమ్మప్ప,నాగిరెడ్డి ,అంపిరెడ్డి, ఓబిసి అద్యక్షులు ఎం. వీరేశ్, చింతలకుంట సాయన్న, రాముడు కొండన్న హనుమంతు , మల్లయ్య, దేవేందర్ రెడ్డి, పాగుంట సర్పంచ్ అంజన్నప్ప, గోవిందు, కృష్ణ కాంత్, కొండాపురం ఉప సర్పంచ్ చిన్న బీమిరెడ్డి, గుడిసె నారాయణ ,అశోక్ రెడ్డి, శేశిరెడ్డి రంగాపురం కృష్ణ, కుచినర్ల నర్సింహులు, కార్యకర్తలు ఉన్నారు. ౦

# సామాన్యుడి కుమారుడికైనా.... కేంద్ర మంత్రి కుమారుడికైనా ఒకటే చట్టం

మొదటి పేజీ తరువాయి...

కేంద్ర సహాయ మంత్రి కుమారుడికైనా చట్టం, సెక్షన్ ఒకటేనని అన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులపై వచ్చిన అభియోగలను నిరూపించుకోవాల్సిన భాద్యత వారి వారి పై వుంటుందని అన్నారు. రాష్టంలో శాంతి భద్రతలు పూర్తిగా గాడితప్పి పూటకో హత్య రోజుకో దోపిడీ జరుగుతుందని ఆరోపించారు. నేరాలను నియంత్రించే నిఘా వ్యవస్థ పూర్తిగా విఫలమైంది అందుకు హోంశాఖ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. హోం శాఖ బాధ్యతలను ఆ శాఖ మంత్రి గా కొనసాగుతున్న గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విస్మరించడంతోనే నేడు అడ్డు అదుపు లేకుండా నేరాలు జరుగుతున్నాయని వాపోయారు. సాక్షాత్తు మహిళా ఐ పి ఎస్ అధికారి మల్కాజ్గిరి కమిషనర్ అర్ధరాత్రి వీదినిర్వహణలో ఉండగా వేధించిన పోకిరీలు, మరో ఐ పి ఎస్ అధికారి భార్య హత్యాకావడం, నగరంలో వరుసగా జరుగుతున్నా హత్యలు, సాక్షాత్తు కేద్రం సహాయ మంత్రి బండి సంజయ్ రాష్టంలో వున్నా సమయంలోనే పట్టపగలు దోపిడీ జరిగిందని ఈ ఘటనలే రాష్టం లో శాంతి భద్రతలు గాడి తప్పయనడానికి నిదర్శనాలు అని అన్నారు.

**ప్రతిపక్ష నాయకులను వేదించడం తప్పా.... నేరాలపై ముందస్తు నిఘా ఏది....?**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులను వేదించడంలో పెట్టిన నిఘా రాష్టం లో వరుసగా జరుగుతున్నా నేరాలపై ముందస్తుగా సరైన నిఘా పెట్టి ఉంటే కొద్దిగైన నేరలను నియంత్రించే వారని, ఇది పూర్తిగా నిఘా వ్యవస్థ వైపల్యం అని మండిపడ్డారు. ఎంత సేపు బి ఆర్ ఎస్ నాయకులు, ఎమ్మెల్యేలు ఎటు పోతున్నారు... ఎక్కడ ప్రజా సమస్యల పరిస్కారం కోసం నిరసన తెలుపుతున్నారు అనే విషయం పైనే రాష్ట్ర నిఘా వ్యవస్థ పనిచేస్తుందని విమర్శించారు. స్వయంగా తాను తెలిసిన వారు చనిపోతే పరామర్శించేందుకు వెళ్తుంటే అడుగడుగునా పోలీస్ లు అడ్డుకున్నారని మండిపడ్డారు. రాష్టం లో మహిళలపై జరుగుతున్నా అఘాయిత్యాలను అరికట్టి, నేరాలు జరుగకుండా చూడాల్సిన భాద్యత పోలీస్ లపై వుంటుందని ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా రక్షణ కోసం పోలీలను వాడుకోవాలని ప్రభుత్వాన్ని సబితా ఇంద్రారెడ్డి కోరారు. ఇ సమావేశంలో బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర స్థాయి మహిళా నాయకురాలు పాల్గొన్నారు.

# కార్యకర్తలు, అభిమానుల కేరింతల నడుమ.. సీఎంగా విజయ్ ప్రమాణం

మొదటి పేజీ తరువాయి...

ఎటుచూసినా కోలాహలం. విజయ్‌తో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ ప్రమాణం చేయించే సమయం రానే వచ్చింది. ఒక్కసారిగా అంతటా నిశ్శబ్దం అలుముకుంది. 'సి.జోసెఫ్ విజయ్ ఎనుం నాన్...(విజయ్ అనే నేను..)' అనే మాటలు విజయ్ నోట వెలువడిందే తడవుగా... కేరింతల మోత మోగింది. ప్రతి ఒక్కరూ లేచి నిలుచుని చప్పట్లతో హోరెత్తించారు. వేదికపై ఉన్న నేతల్లో, కింద ఆసీనులైన విజయ్ తల్లిదండ్రుల్లో సంతోషం వెల్లివిరిసింది. కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హాజరయ్యారు. నటి త్రిష ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తమిళనాడు ముఖ్యమంత్రిగా టీవీకే అధినేత విజయ్ ఆదివారం ఉదయం ప్రమాణం చేశారు. చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విజయ్‌తో గవర్నర్ ఆర్లేకర్ ప్రమాణం చేయించారు. విజయ్‌తో పాటు 9 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. వీరిలో ఎస్.కీర్తన, ఎన్.ఆనంద్, ఆదవ్ అర్జున, కె.జి.అరుణ్‌రాజ్, కె.ఎ.సెంగోట్టైయన్, రాజమోహన్, సీటీఆర్ నిర్మల్‌కుమార్, పి.వెంకట రమణన్, టి.కె.ప్రభు ఉన్నారు. తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచి తమిళనాడు ముఖ్యమంత్రి అయిన రెండో వ్యక్తి విజయ్. మొదటివ్యక్తి పన్నీరుసెల్వం. సీఎంగా ప్రమాణం తర్వాత.. విజయ్ తన తొలి సంతకాన్ని గృహ వినియోగదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు ఫైలుపై చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు భద్రత, మాదక ద్రవ్యాల నిర్మూలన దస్త్రాలపైనా సంతకాలు పెట్టారు. టీవీకే మ్యానిఫెస్టోలో ఈ మూడూ ప్రధాన హామీలుగా ఉన్నాయి.

తెల్లచొక్కా, నల్లకోటు, నల్లప్యాంటును ధరించి వచ్చిన విజయ్.. ప్రమాణం తర్వాత ఇండోర్ స్టేడియం నుంచి వెళ్లి పెరియార్ విగ్రహానికి నివాళి అర్పించారు. తర్వాత రాష్ట్ర సచివాలయానికి చేరుకున్నారు. అక్కడ పోలీసు బలగాల గౌరవ వందనం స్వీకరించారు. తన కార్యాలయంలోకి వెళ్లి ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ సహా ఇతర అధికారులతో కలిసి శాంతిభద్రతలపై తొలి సమావేశాన్ని నిర్వహించారు.

బల నిరూపణకు ఈ నెల 13 దాకా గవర్నర్ సమయం ఇచ్చారు. సోమవారం అసెంబ్లీ సమావేశాలు మొదలవుతాయి. తొలిరోజు ఎమ్మెల్యేలుగా సభ్యుల ప్రమాణం ఉంటుంది. మంగళవారం స్పీకర్, డిప్యూటీ స్పీకర్‌లను ఎన్నుకుంటారు. బలనిరూపణకూ ఈ సమావేశాల్లోనే అవకాశం ఇవ్వనున్నారు. ప్రస్తుతం టీవీకేకు 120 మంది సభ్యుల బలముంది. తాత్కాలిక స్పీకర్‌గా టీవీకే ఎమ్మెల్యే కరుప్పయ్యతో లోక్‌భవన్‌లో గవర్నర్ ప్రమాణం చేయించారు. పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ స్థానాల నుంచి ఎమ్మెల్యేగా విజయ్ గెలిచారు. సీఎంగా ప్రమాణం చేశాక పార్టీ ముఖ్యులతో చర్చించి.. తిరుచ్చి ఈస్ట్‌కు రాజీనామా సమర్పించారు. ప్రమాణ సమయంలో తమిళనాడు రాష్ట్ర ప్రార్థన గీతాన్ని వందేమాతరం, జనగణమన గీతాల తర్వాత ఆలపించడాన్ని సీపీఐ, సీపీఎం తమిళనాడు శాఖలు ఖండించాయి.

# ప్రధాని నరేంద్ర మోదీ సభతో తెలంగాణలో బీజేపీ బలోపేతం: మేకల వనితా రెడ్డి

**బుద్వేల్, మే 10 (ప్రభాత ఉదయం)**

పెరేడ్ గ్రౌండ్ లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సభ చారిత్రాత్మకం అని బీజేపీ మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మేకల వనిత దామోదర్ రెడ్డి అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సభ ను విజయవంతం చేయాలంటూ ఆమె హైదర్ గూడ చౌరస్తాలో ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. బీజేపీ నాయకులతోపాటు ప్రజలు ప్రధాని మోడీ సభకు స్వచ్ఛందంగా తరలిరావాలని కోరారు. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మూడు రాష్ట్రాలలో విజయకేతనం ఎగురవేసిన బీజేపీ రాబోయే కాలంలో తెలంగాణలోనూ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ సభ అనంతరం తెలంగాణలో బీజేపీ పార్టీలో నూతన ఉత్తేజం నిండబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అవినీతి, బంధుప్రీతి లేని పాలన రావాలంటే ప్రజలు బీజేపీ కి పట్టం కట్టాలన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణపై బీజేపీ అధిష్టానం ప్రత్యేక దృష్టి పెట్టి ప్రజల్లోకి వెళ్లే కార్యక్రమాలను చేపట్టే



హైదర్ గూడ చౌరస్తాలో ప్రధాని నరేంద్ర మోడీ సభ ను విజయవంతం చేయాలని బీజేపీ మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మేకల వనితా రెడ్డి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

అవకాశాలు ఉన్నాయని మేకల వనిత దామోదర్ రెడ్డి అన్నారు.

**పెరేడ్ గ్రౌండ్ లో పార్టీ భారీ జెండాతో ప్రత్యేక ఆకర్షణగా మేకల వనితా రెడ్డి**

పెరేడ్ గ్రౌండ్ లో జరిగిన ప్రధాని నరేంద్ర మోదీ సభ సందర్భంగా పార్టీ భారీ జెండా ను చేతబట్టి మేకల వనితా రెడ్డి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి అన్నపు రెడ్డి స్వర్ణలత రెడ్డి తో కలసి ఆమె సభా వేదికలో పాల్గొన్నారు.


పెరేడ్ గ్రౌండ్ లో బీజేపీ భారీ జెండాతో మేకల వనితా రెడ్డి

**పెద్ద సంఖ్యలో తరలి వెళ్లిన బీజేపీ నాయకులు :**

సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్ లో జరిగిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభకు రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో ఆ పార్టీ నాయకులు, అభిమానులు తగిలి వెళ్లారు. బస్సులు, కార్లు, మోటార్ సైకిల్ ల పై పార్టీ నాయకులు పెరేడ్ గ్రౌండ్ సభకు వెళ్లారు.


పార్టీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి అన్నపు రెడ్డి స్వర్ణలత రెడ్డి తో.....


అత్తాపూర్ లక్ష్మీ నగర్ పార్కులో మార్నింగ్ వాకర్స్

# డిజిటల్ యుగంలో మానసిక రోగులు పెరుగుతున్నారు

## అండర్ స్ట్రెస్ పట్ల తస్మాత్ జాగ్రత్త.. ఎర్రగడ్డ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ సూపరింటెండెంట్ డాక్టర్ అనిత రాయిరాల

**బుద్వేల్, మే 10 (ప్రభాత ఉదయం)**

కంప్యూటర్లు, స్మార్ట్ ఫోన్లు వంటి డిజిటల్ పరికరాలను మితిమీరి వాడటం వల్ల రోజు రోజు కి మానసిక రుగ్మతలు పెరిగిపోతున్నాయని ఎర్రగడ్డ లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ విభాగం సూపరింటెండెంట్ డాక్టర్ అనిత రాయిరాల ఆందోళన వ్యక్తం చేశారు. స్పార్క్ అహం సూత్ర మీడియా ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం అత్తాపూర్ లక్ష్మీనగర్ పార్కులో మెంటల్ హెల్త్ పై టాకింగ్ సర్కిల్ అనే పేరిట అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ అనిత ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. చాప క్రింద నీరులా పిల్లలు, యువతి యువకులలో అం డర్ స్ట్రెస్ పెరిగిపోతున్నదన్నారు. తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎర్రగడ్డ మెం టల్ హాస్పిటల్ లో పేషెంట్ల సంఖ్యలో 20శాతం పెరుగుదల కనిపిస్తుందని, ఇది కొంత కలవరపరిచే విషయం అని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ తరం పిల్లలలో లక్షణాలు కనిపించకుండ అండర్ స్ట్రెస్ పెరుగుతుందని. దానిని తల్లిదండ్రులు వెంటనే గమనించి అప్రమత్తం కావాలన్నారు. పిల్లలు ఒంటిరిగా ఉ ంటున్నప్పుడు తల్లిదండ్రులు వారితో ప్రేమగా మెలగాలన్నారు. పెద్దలు కూడా మానసిక ఆరోగ్యాన్ని కా పాడుకోవాలన్నారు. పది మందితో కలవడం, అహ్లాదకరమైన వాతావరణంలో ఉండటం మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో అత్తాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి, పుర ప్రముఖులు, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మహేందర్, డాక్టర్ సీతారాం, సీనియరు జర్నలిస్టు, సామాజిక కార్యకర్త మ్యాడం మధుసూదన్, రాచూరి అజిత్ తదితరులు పాల్గొన్నారు.


బైక్ ర్యాలీ లో పాల్గొన్న యువత

# తలసేమియను ప్రారదోలాలి

## డాక్టర్ చంద్రకాంత్ అగర్వాల్

**బుద్వేల్, మే 10 (ప్రభాత ఉదయం)**

తలసేమియ, సికిల్ సెల్ వ్యాధులను తెలంగాణ రాష్ట్రం నుంచి, దేశం నుంచి తరిమికొట్టాల్సిన భాధ్యత ప్రభుత్వాలపై, ప్రజందరిపై ఉందని తలసేమియ సికిల్ సెల్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ చంద్రకాంత్ అగర్వాల్, సీఈఓ, కార్యదర్శి డాక్టర్ సుమన్ జైన్, ఉపాధ్యక్షురాలు కొత్తపల్లి రత్నవల్లి లు అన్నారు. సంస్థ జాయింట్ సెక్రటరీ అలీం బేగ్ ఆధ్వర్యంలో ప్రపంచ తలసేమియ దినోత్సవాల ను పురస్కరించుకుని ఆదివారం నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. శివరాంపల్లి లోని తలసేమియ సికిల్ సెల్ సోసైటీ కార్యాలయం నుంచి 75 బైక్ లతో హిడెన్ నో మోర్ అన్మాస్కింగ్ తలసేమియ ట్రాన్స్ఫార్మింగ్ లైవ్స్ అనే పేరుతో ఈ బైక్ ర్యాలీ జరిగింది. వండరర్స్ బ్రదర్ హుడ్ రైడింగ్ కమ్యూనిటీ సహకారంతో జరిగిన ఈ బైక్ ర్యాలీ జూపార్కు, ఎంజె మార్కెట్, అపల్గంజ్, పురానీహవేలి, మీరాలం మండి, తలాబ్కట్ట, షా అలి బండ, చాంద్రాయణగుట్ట, మైలార్దేవుపల్లి, ఆరాంఘర్ మీదుగా శివరాంపల్లి లోని తలసేమియ కార్యాలయానికి చేరుకుంది. తలసేమియ వ్యాధి ని గర్భిణీలుగా ఉన్నప్పుడే గుర్తించడానికి వీలుంటుందన్నారు. అందుకోసం హెచ్బీఏ2 పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుందన్నారు.

**రక్తదాత లకు సన్మాణం:**

అంతర్జాతీయ తలసేమియ దినోత్సవం సందర్భంగా తలసేమియ రోగులకు అండగా ఉ ంటు వారికి రక దానాల ద్వారా ప్రాణ దానం చేస్తున్న రక్తదాన శిభిరాల నిర్వాహకులకు ఈ సందర్భంగా తలసేమియ సికిల్ సెల్ సోసైటీ ఆధ్వర్యంలో సన్మాణం చేశారు. తలసేమియ పై ప్రజలలో అవగాహన పెంపొందిం చాలని సూచించారు. తలసేమియ ఉన్న భార్యభర్తలకు పుట్టిన బిడ్డలకు ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉం దన్నారు. ముందే గుర్తిస్తే ఆ వ్యాధి ని అరికట్టవచ్చన్నారు.

# మైలార్‌దేవుపల్లి నుంచి పెరేడ్ గ్రౌండ్‌కు తరలి వెళ్లిన బీజేపీ నాయకులు


జెండా ఊపి ప్రారంభిస్తున్న ఆ పార్టీ రాష్ట్ర నాయకులు తోకల శ్రీనివాస్ రెడ్డి



మైలార్ దేవుపల్లి నుంచి ప్రధాని మోదీ సభకు తరలివెళ్లిన బీజేపీ నాయకులు...

**బుద్వేల్, మే 10 (ప్రభాత ఉదయం) :**

రాజేంద్ర నగర్ నియోజక వర్గ పరిధిలోని మైలర్ దేవ్ పల్లి కాటేదన్ బీజేపీ పార్టీ కార్యాలయంలో నుంచి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేంద్ర నగర్ నియోజక వర్గ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో డివిజన్ బీజేపీ పార్టీ ముఖ్య నాయకులతో కలిసి జెండా ఊపి సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ బహిరంగ సభకు భారీ జన సమీకణతో తరలివెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు చారిత్రాత్మకంగా మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా తెలంగాణకు వస్తున్న మన గౌరవ ప్రధానమంత్రి కి రాజేంద్ర నగర్ నియోజక వర్గం మైలర్ దేవ్ పల్లి డివిజన్ల నుండి పెద్ద ఎత్తున దుర్గా నగర్ చౌరస్తా నుంచి బైక్ ర్యాలీతో అదేవిధంగా 25 బస్సులు 100కార్లు సుమారు 2000 జన సమీకరణతో సభకు తరలివెళ్లడం జరిగింది. దేశ ప్రియతమ ప్రధాని గౌరవనీయులైన నరేంద్ర మోడీ నాయకత్వం వర్ధిల్లాలి అని నినాదాలతో నియోజకవర్గం మైలార్దేవ్పల్లి డివిజన్ నుంచి భారీ ఎత్తున జన సమీకరణతో బహిరంగ సభకు తరలి వెళ్లడం జరిగింది. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ బహిరంగ సభకు భారీ సంఖ్యలో తరలి వెళ్లి ప్రియతమ ప్రధాని నరేంద్ర మోడీ ఘన స్వాగతం పలికి సభను విజయవంతం చేయవలసిందిగా మరోసారి అందరికీ పిలుపునివ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సీనియర్ నాయకులు మహిళా మోర్చా అధ్యక్షురాలు మహిళలు సీనియర్ నాయకులు బీజేవైఎం నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున యువకులు పాల్గొనడం జరిగింది

# తల్లిదండ్రులు వేర్వేరుగా ఉండటం, తనను ఎవరు పట్టించుకోవడం లేదనే భావన తో ఓ యువకుడు ఆత్మహత్య

**బుద్వేల్, మే 10 (ప్రభాత ఉదయం)**


ప్రేమ్ శివాజీ మోరే

తల్లిదండ్రులు వేర్వేరుగా ఉండటం, తనను ఎవరు పట్టించుకోకపోవడం, హాస్టల్ లో ఉండి చదువుకోవడం లాంటి సంఘటనల వల్ల మనస్థాపానికి గురైన ఓ యువకుడు మహరాష్ట్ర నుంచి నగరంలోని లక్ష్మీగూడ లో ఉండే మేన మామ ఇంటికి వచ్చి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన శనివారం సాయంత్రం జరిగింది. వివరాలను మైలార్దేవుపల్లి ఎస్ఐ పైడి నాయుడు వివరించారు. మహరాష్ట్ర ఉస్మానాబాద్ జిల్లా కొతాలి పోస్ట్ కంతేకూర్ గ్రామానికి చెందిన ప్రేం శివాజీ మోరె (18) కొన్ని రోజుల క్రితం నగరంలోని లక్ష్మీగూడ లో నివాసం ఉండే మేనమామ శం కర్ నివాసానికి వచ్చాడు. మహరాష్ట్రలో తండ్రి శివాజీ మోరే. తల్లి లు గొడవల వల్ల వేర్వేరుగా ఉం టున్నారు. ప్రేం శివాజీ మోరే హాస్టల్లో ఉండి చదువుకుంటున్నాడు. ఇటీవల నే 10వ తరగతి ఉత్తీర్ణులయ్యాడు. నాలుగు రోజుల క్రితం తండ్రి శివాజీ మెరే కూడా లక్ష్మీగూడ వచ్చి వెళ్లాడు. తల్లిదం డ్రులు వేర్వేరుగా జీవిస్తుండటం, తనను ఎవరు పట్టించుకోకపోవడం తో మనస్థాపానికి గురైన ప్రేం శివాజీ మోరే శనివారం సాయంత్రం ఇంట్లో ఎవరు లేని సమయంలో ప్యాను కు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తర్వాత గమనించిన మేనమామ శంకర్ వచ్చి చూడగా ప్రేం శివాజీ మోరే అప్పటికే మరణించాడు. మైలార్దేవుపల్లి పోలీసులకు నిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చ్యురీకి తరలించి కేసు దర్యాప్తు చేసు బిన్నారు.

# స్నేహితుల దాడిలో మృతి చెందిన యువకుడు

**బుద్వేల్, మే 10 (ప్రభాత ఉదయం)**

డబ్బుల విషయమై జరిగిన గొడవ ఓ యువకుని ప్రాణాలను బలి తీసుకుంది. అత్తాపూర్ పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఈ విదంగా ఉన్నాయి...లంగర్ హౌజ్ కు చెందిన హుస్సేన్ (25) ఏసీ మెకానిక్ గా పనిచేస్తాడు. డబ్బుల విషయమై అతనికి, అతని స్నేహితుల మధ్య శనివారం సాయంత్రం గొడవ జరిగింది. దీంతో శివరాంపల్లి కి చెందిన ముగ్గురు స్నేహితులు హుస్సేన్ ను పిల్లర్ నెంబర్ 223 వద్ద దాడి చేసి గాయపరిచారు. అక్కడి నుంచి బైక్ పై ఎక్కించుకుని వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారానికి సమీపంలోకి తీసుకువెళ్లి తిరిగి దాడి చేశారు. ఈ దాడిలో హుస్సేన్ అపస్మారక స్థితికి చేరుకోవడంతో వారు అతన్ని వదిలిపెట్టి పారిపోయారు. హుస్సేన్ ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతు మరణించాడు. కేసు నమోదు చేసుకున్న అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ నాగేశ్వర్ రావు నిందితుల కోసం గాలిస్తున్నారు.

# పని కోసం వెళ్లిన వ్యక్తి అదృశ్యం

**బుద్వేల్, మే 10 (ప్రభాత ఉదయం):**

పని కోసం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి కనిపించకుండా పోయాడు. మైలార్దేవుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటన ఎస్ఐ పైడి నాయుడు కథనం ప్రకారం..... శాస్త్రీపురం నూర్ కాలనీ కి చెందిన మహ్మద్ జహంగీర్ (36) ఈ నెల 8వ తేదీన ఇం టి నుంచి పని కోసం బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆయన భార్య ముంతాజ్ బేగం తన భర్త అదృ శ్యమైనాడని మైలార్దేవుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మహ్మద్ జహంగీర్ ఆచూకి తెలిసిన వారు 9490617267 నెంబర్ కు సమాచారం ఇవ్వాలన్నారు.


మహ్మద్ జహంగీర్


కేక్ కట్ చేస్తున్న సిస్టర్ ఎం ప్రియకళ తదితరులు

# రాజేంద్రనగర్, గండిపేట్‌లలో మదర్స్ డే వేడుకలు

**బుద్వేల్, మే 10 (ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్, గండిపేట్ ప్రాంతాలలో ఆదివారం మదర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఒకరికొకరు మదర్స్ డే శు భాకాంక్షలు తెలుపుకున్నారు. రాజేంద్రనగర్ మన్నా చర్చిలో పాస్టర్ సీహెచ్ ప్రభావతి ఆధ్వర్యంలో మహిళలందరూ సమావేశమయ్యారు. గండిపేట్ జీసస్ క్రైస్ట్ ఫెలోషిప్ చర్చ్ లో జరిగిన మదర్స్ డే వేడుకలలో పాస్టర్ ఎం ప్రియకళ, సిస్టర్ కె ప్రేమిలా, కె.పుష్ప లత లు పాల్గొన్నారు.


రాజేంద్రనగర్ మన్నా చర్చ్ లో మాతృ మూర్తులు. చిత్రంలో పాస్టర్ సీ హెచ్ ప్రభావతి తదితరులు

# వరికొయ్యలకు నిప్పు...పర్యావరణానికి ముప్పు





## మండల వ్యవసాయ శాఖ అధికారి రాజవర్ధన్ రెడ్డి

**గద్వాల జిల్లా ప్రతినిధి,మే10(ప్రభాత ఉదయం)**

జోగులాంబ గద్వాల జిల్లాలో యాసంగి సీజన్ వరి కోతలు దాదాపు ముగింపు దశకు చేరుకున్నాయి. పొలాలను ఖరీఫ్ పంటల సాగుకు సిద్ధం చేయాలన్న ఆలోచనతో ఉన్న రైతులు వరి కొయ్యలు కాలుస్తున్నారు. దీంతో వాయుకాలుష్యం పెరగడం, భూమి సారంతో పాటు సహజత్వాన్ని కోల్పోతుందని వ్యవసాయ రంగ నిపుణులు అంటున్నారు. వరి కొయ్యలకు నిప్పు పెట్టే క్రమంలో సమీపంలో ఉన్న వరితో పాటు చెరుకు, పామాయిల్ పంటలు, గడ్డి వాములకు మంటలు వ్యాపించి దగ్ధమైన ఘటనలు ఉన్నాయి. కొయ్యలను కాల్చొద్దని వ్యవసాయాధికారులు జిల్లావ్యాప్తంగా పలు దఫాలుగా ప్రచారం చేస్తున్నా రైతులు పట్టించుకోవడం లేదు. కొందరు రైతుల్లో అవగాహన లేక యథావిధిగా అదే తంతును కొనసాగిస్తున్నారు. పశువులున్న వారు గడ్డిని ఒకచోట మోపులుగా చేర్చి కొయ్యలను కాలుస్తున్నారు. సులువుగా పనైపోతుందనే ధ్యాసలో భూసారానికి తోడు పర్యావరణానికి విఘాతం కలిగించే ప్రక్రియ చేపడుతున్నారు.

**కలియ దున్నితేనే లాభం..**

వరిని యంత్రాలతో తక్కువ ఎత్తులో కోసేలా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. ఆ తర్వాత కొయ్యలను పొలంలోనే కలియ దున్నాలి. సూపర్ పాస్ఫేట్ చల్లడంతో పొలంలో త్వరగా కలిసిపోయే అవకాశం ఉంటుంది. కొయ్యలు భూమిలో కలవడంతో పొటాషియం, నత్రజని, భాస్వరం మూలకాలు పంటకు సమృద్ధిగా అందుతాయి. దిగుబడులు 10శాతం వరకు పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంటున్నారు.

**నిప్పు పెట్టడం వల్ల కలిగే నష్టాలు...**

వరి కొయ్యలను కాల్చడం వల్ల వాతావరణ కాలుష్యం పెరుగుతుంది. విపరీతమైన వేడితో భూమి సారాన్ని కోల్పోతుంది. ముఖ్యంగా నత్రజని, పాస్పరస్ లాంటి పోషక పదార్థాల శాతం, దిగుబడి తగ్గిపోతుంది. భూమికి పీచు పదార్థంగా ఉపయోగపడే అవశేషాలు కాలిపోతాయి. పంటలకు అవసరమైన ఖనిజ లవణాలు దెబ్బతింటాయి. మేలు చేసే సూక్ష్మజీవులు చనిపోతాయి. పొలాల్లో తిరిగే పాములు, ముంగీసలు, ఉడుములు, నెమళ్లు, తొండలు ఇలా అనేక రకాల జీవరాశులు చనిపోయే ప్రమాదం ఉంది. దీంతో ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుంది. మంటలు వ్యాపించి ఇతర పంటలతో పాటు, గడ్డి వాములు, గట్లు, మొరం గడ్డలపై ఉన్న పచ్చని చెట్లు కూడా ఒక్కోసారి బుగ్గిపాలవుతున్నాయి ఆలస్యంగా కోతకు వచ్చే పంటలు, కల్లాలు దగ్గరే ఉంటే ధాన్యం కాలిపోయే ప్రమాదం ఉంది.

**అవగాహన కల్పించని అధికారులు**

వరి కొయ్యలకు నిప్పు పెట్టొద్దని అధికారులు, రైతులకు సూచనలు, సలహాలు అందించడం లేదు. అంతే కాదు అధికారులు రైతుబంధు, రైతు బీమాపై తప్ప రైతులకు క్షేత్రస్థాయిలో సలహాలు, సూచనలు అందించడం లేదు. కనీసం క్రాప్ బుకింగ్‌లోనైనా క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు సాగు వివరాలు సేకరించాల్సి ఉంటుంది కానీ రైతు వేదికలలో ఉంటూ రైతులను పిలిపించుకొని పంటలు నమోదు చేస్తున్నారని రైతులే చెబుతున్నారు. ఇకనైనా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సూచనలు అందించాల్సిన అవసరమున్నది.

**అవగాహన కల్పిస్తున్నాం:రాజవర్ధన్ రెడ్డి, మండల వ్యవసాయాధికారి, కేటిదొడ్డి**

కొయ్యలను కాల్చరాదని, పొలంలోనే కలియ దున్నితే లాభమని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. కాలిస్తే భూమి సారాన్ని కోల్పోతుంది. నేలకు మేలు చేసే కీటకాలు, సూక్ష్మజీవులు చనిపోతాయి. వాయు కాలుష్యం పెరిగి పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుంది. కలియదున్నితే కొద్ది రోజుల్లోనే కుళ్లిపోయి ఎరువుగా మారిపోతుంది.



పాగుంటలో మంటలు వ్యాపించి అంటుకున్న గడ్డివాములు

# వామనపల్లిలో మరో మారు పంజా విసిరిన చిరుత?

## భయాందోళనకు గురవుతున్న గ్రామస్తులు

**గద్వాల జిల్లా ప్రతినిధి,మే10(ప్రభాత ఉదయం)**

గుర్తు తెలియని జంతువు దాడిలో ఆవు దూడ మృతి చెందింది. ధరూర్ మండలం వామన్ పల్లి గ్రామానికి చెందిన అనీల్ అనే రైతు పశువులను పొలం వద్ద కట్టేసి ఇంటికి వచ్చాడు. ఆదివారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా ఆవు దూడ మృత్యువాత పడింది. ఆవు దూడను చంపింది చిరుత పులి లేక హైనా అనేది అనుమానాలు ఉండటంతో గ్రామ సర్పంచ్ పర్ణికారెడ్డి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. మూడునెలల కిందా ఆవు దూడను గుర్తు తెలియని జంతవు దాడి చేసింది అని ఇప్పటి వరకు దాడి చేసిన జంతువు ఏది అని అధికారులు గుర్తించలేకపోయారు. . ఫిబ్రవరి నెలలో గుర్తు తెలియని జంతువు దాడి చేసిన ఘటన మరువకముందే మరో సారి దాడి చేయడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ముమ్మాటికి చిరుత పులి అని గ్రామస్తులు అనుమానిస్తున్నారు.

# గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సమస్యలపై ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి వినతి

**మల్కాజ్‌గిరి, మే 10,(ప్రభాత ఉదయం)**



ఈరోజు మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి భవన నిర్మాణ సెంట్రింగ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా సెంట్రింగ్ పని బంద్‌కు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరించారు.భవన నిర్మాణ సెంట్రింగ్ కార్మికుల సమస్యల సాధన కోసం ఈ నెల 16వ తేదీ నుండి సెంట్రింగ్ పని బంద్‌కు పిలుపునిస్తున్నామని, తమ డిమాండ్లు నెరవేరే వరకు సమ్మె కొనసాగుతుందని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.ఈ సందర్భంగా వారు ప్రభుత్వానికి పలు కీలక డిమాండ్లను వినిపించారు. వాటిలో ముఖ్యంగా భవన నిర్మాణ సెంట్రింగ్ కార్మికులకు కార్మిక శాఖ ద్వారా శాశ్వత గుర్తింపు కార్డులు జారీ చేయడం, 55 సంవత్సరాలు పూర్తయిన కార్మికులకు నెలకు రూ.3,000 పెన్షన్ అందించడం, ఈఎస్ఐ ఆసుపత్రుల్లో వైద్య సదుపాయాలు కల్పించడం, ప్రమాదవశాత్తు మరణించిన కార్మికులకు నష్టపరిహారాన్ని రూ.20 లక్షలకు పెంచడం వంటి అంశాలు ఉన్నాయి.అదేవిధంగా సెంట్రింగ్ మెటీరియల్ దొంగతనాలపై వెంటనే కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని, స్క్రాప్ దుకాణాల్లో అక్రమంగా మెటీరియల్ కొనుగోలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, జీహెచ్ఎంసీ కూల్చివేతల సమయంలో ముందుగా సెంట్రింగ్ మెటీరియల్ తొలగించుకునే అవకాశం కల్పించాలని కోరారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీలో సెంట్రింగ్ సంఘానికి రెండు ఎకరాల స్థలం కేటాయించాలని, నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పించాలని కూడా విజ్ఞప్తి చేశారు.సమస్యలను శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కార్మికుల సమస్యలపై సానుకూలంగా స్పందిస్తూ, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్‌కు చెందిన నేరేడ్మెట్ జోన్, మల్కాజ్‌గిరి, ఆల్వాల్ ప్రాంత ప్రతినిధులు విష్ణువర్ధన్ రెడ్డి, ఈశ్వర్ గౌడ్, గంగారాం, చిత్తారి, రామకృష్ణ గౌడ్, శ్రీనివాస్, మోహన్, మహేష్, కృష్ణ, చాంద్ పాషా, పరశురాం రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ప్రవీణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.



# ఎల్‌హెచ్‌ఎస్ పనులు వేగవంతంగా చేపట్టండి

## ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**మల్కాజ్‌గిరి, మే 10(ప్రభాత ఉదయం)**

ఎల్‌హెచ్ఎస్ నిర్మాణ పనులు వేగవంతంగా చేపట్టాలని మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి అధికారులకు సూచించారు. ఆదివారం మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సఫిల్‌గూడ రైల్వే స్టేషన్ సమీపంలో కొనసాగుతున్న ఎల్‌హెచ్ఎస్ నిర్మాణ పనులను స్థానిక నాయకులు, కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యతతో పాటు వేగంగా పనులు పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, హేమంత్ పటేల్, స్థానిక కాలనీవాసులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థి దశ నుండే క్రీడలపై ఆసక్తి పెంపొందించాలి

**సమాజం నుండి మాదకద్రవ్యాలను తరిమికొట్టాలి..**

**ప్రతి విద్యార్థి క్రీడా స్ఫూర్తి పెంపొందించుకోవాలి**

**క్రీడలు.. క్రీడాకారుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం:పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**పటాన్ చెరులో ఘనంగా ప్రారంభమైన గూడెం విష్ణువర్ధన్ రెడ్డి స్మారక 10వ జాతీయస్థాయి ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్ పోటీలు**

**వివిధ రాష్ట్రాల నుండి హాజరైన రెండు వేల మంది క్రీడాకారులు**

**ఎమ్మెల్యే ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు**







**పటాన్ చెరు, మే 10 (ప్రభాత ఉదయం):**

ప్రస్తుత పోటీ ప్రపంచంలో మానసిక ప్రశాంతత, శారీరక ధారుఢ్యత కోసం విద్యార్థి దశ నుండి క్రీడలపై ఆసక్తి పెంపొందించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని.. నియోజకవర్గంలో క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని భారత రత్న పివి నరసింహారావు ఆడిటోరియంలో ఎమ్మెల్యే జిఎంఆర్ సౌజన్యంతో లక్కీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గూడెం విష్ణువర్ధన్ రెడ్డి స్మారక 10 జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్ షిప్ పోటీలకు ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ గత 10 సంవత్సరాలుగా జాతీయ స్థాయిలో కరాటే పోటీలు నిర్వహించడం సంతోషకరంగా ఉందన్నారు. వివిధ రాష్ట్రాల నుండి సుమారు రెండు వేల మంది క్రీడాకారులు టోర్నమెంట్ కు హాజరు కావడం పటాన్చెరు నియోజకవర్గం యొక్క ఖ్యాతిని నలుదిశలా చాటి చెప్పినట్లు అయ్యిందని అన్నారు. చిన్ననాటి నుండి తనకు క్రీడలు అంటే ఎంతో మక్కువ అని, నియోజకవర్గ స్థాయిలో క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. దశాబ్దాల చరిత్ర కలిగిన పటాన్చెరు పట్టణంలోని మైత్రి మైదానాన్ని ఆధునికరించడంతోపాటు ఏడాది పొడవునా వివిధ క్రీడ అంశాల్లో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ స్థాయి క్రీడాకారుల కోసం నియోజకవర్గ వ్యాప్తంగా మూడు మినీ స్టేడియాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ప్రస్తుత సమాజంలో మాదకద్రవ్యాలు అత్యంత ప్రమాదకరంగా మారాయని. సమాజం నుండి వాటిని తరిమి కొట్టడంలో ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థి దశ నుండి పిల్లలకు వాటి దుష్పరిమానాలను వివరించాలని కోరారు. విద్యార్థులు చదువుతోపాటు, క్రీడల పైన ఆసక్తి పెంచుకొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని కోరారు. క్రీడాకారులకు ఎటువంటి సహకారం కావాలన్న తనను సంప్రదించాలని కోరారు. కరాటే పోటీల నిర్వహణ కోసం ఎమ్మెల్యే జిఎంఆర్ 5 లక్షల రూపాయల సొంత నిధులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మెట్టు కుమార్ యాదవ్, అంజయ్య యాదవ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, అమీన్పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, దశరథ్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రామచంద్ర రెడ్డి, మైత్రి క్లబ్ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి, వెంకటేష్, చంద్రశేఖర్, షకీల్, టోర్నమెంట్ నిర్వాహకులు రాజు యాదవ్, వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన క్రీడాకారులు, తల్లిదండ్రులు, అకాడమీ మాస్టర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సైబరాబాద్ సీఐల పోస్టింగ్ 'కుర్చీ'లాట.. ఖాకీ వనంలో ఖద్దరు పెత్తనం!

## మాదాపూర్ నుంచి అమీన్‌పూర్ వరకు పైరవీల 'స్టేషన్'.. నిబద్ధతకు ఉరిశిక్ష.. అక్రమార్కులకు అండదండలు!

**శేరిలింగంపల్లి : మే 10, (ప్రభాత ఉదయం)**



ప్రజా రక్షణకు కవచంలా నిలవాల్సిన ఖాకీ కోటలో ఇప్పుడు 'రాజకీయ' గాలులు వీస్తున్నాయి. ఐటీ హబ్‌గా, వేల కోట్ల రూపాయల భూదందాలకు నిలయంగా మారిన సైబరాబాద్ పరిధిలో ఇప్పుడు లా అండ్ ఆర్డర్ కంటే 'ల్యాండ్ అండ్ సెటిల్‌మెంట్' ఆర్డర్‌కే ప్రాధాన్యత పెరుగుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా సిఐ (ఇన్‌స్పెక్టర్) స్థాయి పోస్టింగ్ కోసం మంత్రులు, ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేయడం ఇప్పుడు పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

**'గోల్డెన్' కుర్చీల కోసం గట్టి పోటీ.**

సైబరాబాద్ పరిధిలోని మాదాపూర్, గచ్చిబౌలి, నార్సింగి, కొల్లూరు. రాయదుర్గం. పటాన్చెరు. బాచుపల్లి. అమీన్‌పూర్ వంటి పోలీస్ స్టేషన్లకు ఇప్పుడు విపరీతమైన డిమాండ్ పెరిగింది. వీటికి గల ప్రధాన కారణాలు. ఈ ప్రాంతాల్లో జరుగుతున్న వేల కోట్ల భూ లావాదేవీలు. సెటిల్‌మెంట్లు సివిల్ తగాదాల్లో పోలీసుల జోక్యం ద్వారా వచ్చే 'అదనపు' ఆదాయం. రాజకీయ రక్షణ అధికార పార్టీ నేతలకు అనుకూలంగా వ్యవహరించే వారికి కొమ్ముకాపులుగా మారుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ స్టేషన్లలో పోస్టింగ్ పొందితే చాలు, కెరీర్ సెటిల్ అయిపోతుందనే భావనతో కొందరు అధికారులు ఏకంగా కోట్లు ఖర్చు పెట్టి, రాజకీయ నాయకుల ద్వారా వత్తిడి తెస్తున్నారు.

**పైరవీల వెనుక 'బరితెగించిన' అధికారులు**

గతంలో స్టీఫెన్ రవీంద్ర సీపీగా ఉన్న సమయంలో కొందరు అధికారులు బరితెగించి అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ సమయంలో అవినీతి ముద్ర పడి, వివాదాల్లో చిక్కుకున్న ఓ అధికారి ఇప్పుడు మళ్ళీ కీలకమైన పోస్టింగ్స్ కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

సదరు అధికారికి తాజా బదిలీలలో పోస్టింగ్ ఖాయమైనప్పటికీ తనకు మాదాపూర్ పోస్టింగే కావాలని రాజకీయ నాయకులతో ఒత్తిడి తెస్తున్నట్లు హైదరాబాదులో పుకార్లు షికార్లు చేస్తున్నాయి. తనకున్న రాజకీయ పలుకుబడితో ఆ బదిలీలను ఆపించినట్లు పోలీసు శాఖలో ప్రచారం జరుగుతుంది. "రాజకీయ నాయకులు చెబితేనే పని చేస్తాం" అనే ధోరణి ఉన్న అధికారుల వల్ల సామాన్యులకు న్యాయం జరుగుతుందా? అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. ప్రతిపక్షం మాట దేవుడెరుగు సామాన్యుడి పరిస్థితి ఏంటి? రాజకీయ నాయకుల సిఫార్సుతో కుర్చీ ఎక్కిన అధికారి, సహజంగానే ఆ నాయకుడికి 'కృతజ్ఞత'గా వ్యవహరిస్తారు. దీనివల్ల సామాన్యులకు న్యాయం దూరం అవుతుందని పరిశీలకులు అంటున్నారు. ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలు లేదా సామాన్య ప్రజలు ఫిర్యాదు చేస్తే, అధికార పార్టీ నేతల అనుమతి లేనిదే కేసు నమోదు చేయని పరిస్థితి నెలకొంది.

**ఏకపక్ష విచారణ:**

భూ వివాదాల్లో అధికార పార్టీ నాయకుల వైపు నిలబడి బాధితులనే నిందితులుగా మార్చే 'రివర్స్' ట్రెండ్ నడుస్తోంది.

**పోలీసు వ్యవస్థ నిర్వీర్యం**

చట్టం తన పని తాను చేసుకుపోవడానికి బదులు, 'ఫోన్ కాల్' తన పని తాను చేసుకుపోతోంది.

**గతం వర్సెస్ వర్తమానం: మాజీ అధికారుల ఆవేదన**


గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కూడా ఇలాంటి రాజకీయ పోస్టింగ్స్ కొన్ని కనిపించాయి. అప్పట్లో మైనార్టీ ప్రభుత్వాల మనుగడ కోసం రాజకీయ వత్తిళ్లకు తలొగ్గాల్సి వచ్చేది. కానీ నేడు పూర్తి మెజారిటీ ఉన్నా పోలీసు వ్యవస్థలో ఇంతటి జోక్యం ఉండటం పట్ల మాజీ పోలీసు అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పూర్వం ఒకటో రెండో పోస్టింగ్స్ సిఫార్సులపై ఉండేవి. కానీ ఇప్పుడు మొత్తం వ్యవస్థనే ఖద్దరు చొక్కాలు శాసిస్తున్నాయి. ఇది పోలీసుల చేతులు కట్టేయడమే అని ఒక రిటైర్డ్ అధికారి వాపోయారు.

**మేధావుల విశ్లేషణ**

వ్యవస్థలో మార్పు ఎప్పుడు? మైనార్టీ ప్రభుత్వాలు లేదా సంకీర్ణ రాజకీయాలు ఉన్నప్పుడు అధికారుల బదిలీలు సంతలో సరకుల్లా మారుతాయని మేధావులు విశ్లేషిస్తున్నారు. పై స్థాయి నుంచి కింది స్థాయి వరకు అధికారులు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలంటే 'ఫ్రీ హ్యాండ్' ఇవ్వడం అత్యవసరం. ముఖ్యమంత్రి, డీజీపీ బదిలీలపై సమీక్షించాల్సిన అవసరం ఎంతైన ఉందని పలువు మాజీ పోలీసు అధికారులు అభిప్రాయం పడుతున్నారు. పోస్టింగ్స్ లో రాజకీయ వడపోత ఉండాలంటున్నారు. ఎమ్మెల్యేలు, మంత్రుల సిఫార్సు లేఖల కంటే, సదరు అధికారి ట్రాక్ రికార్డ్ నిజాయితీని ప్రామాణికంగా తీసుకోవాలని సూచిస్తున్నారు. తప్పు చేసిన అధికారికి రాజకీయ అండ ఉన్నా సరే, కఠినంగా శిక్షించే సంస్కృతిని డీజీపీ స్థాయి నుంచి ప్రారంభించాలి. కీలక స్టేషన్లలో పని చేసే అధికారులకు కనీసం రెండేళ్ల పదవీ కాలం ఉండేలా చూడాలి, తద్వారా వారు రాజకీయ నాయకులకు భయపడాల్సిన అవసరం ఉండదు. సైబరాబాద్ వంటి కీలక కమిషనరేట్‌లో 'కుర్చీలాట' ఆపకపోతే, అది కేవలం నేరస్థులకే వరంగా మారుతుంది. శాంతిభద్రతలు క్షీణిస్తే పెట్టుబడులు వెనక్కి వెళ్లే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం తోపాటు ఉన్నతాధికారులు మేల్కొని రాజకీయ రంగు లేని పోలీసు వ్యవస్థను పునరుద్ధరించాలని ప్రజలు కోరుకుంటున్నారు. పోలీసుల చేతిలో లాఠీ ఉండాలి కానీ.. రాజకీయ నాయకుల తాళం ఉండకూడదని మేధావులు అభిప్రాయం పడుతున్నారు. గత వారం చేసిన సీఐల బదిలీల ప్రక్రియను ఈ వారంలో పూర్తి కావచ్చని అంటున్నారు. కొన్ని సాంకేతికకణాలతో పాటు ప్రధాన మంత్రి పర్యటన ఉండటం వలన బదిలీలు ఆగినట్లు చెప్తున్నారు. ప్రధానమంత్రి పర్యటన విజయవంతం కావడంతో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎస్సైలు సీఐలో పోస్టింగ్ పై దృష్టి సారించి ప్రచారం జరుగుతుంది

# ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఫ్లెక్సీలను తొలగించడం బాధాకరం





చింపి వేసిన బీజేపీ ఫ్లెక్సీలు

**బుద్వేల్, మే 10 (ప్రభాత ఉదయం)**

పెరేడ్ గ్రౌండ్స్ లో ప్రధానమంత్రి నరేంద్రమోడీ బహిరంగ సభసందర్భంగా ఆదివారం కట్టిన ఫ్లెక్సీలను సభ ప్రారంభం కాకముందే రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్ల జీహెచ్‌ఎంసీ అధికారులు చింపివేయడం, తొలగించడం బాధాకరమని బీజేపీ మైలార్దేవుపల్లి డివిజన్ 2 అధ్యక్షులు సూరెడ్డి వినియెడ్డి అన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు కాంగ్రెస్ నాయకుల వలే ప్రవర్తిసు న్నారన్నారు. ఇటీవల రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టీ ప్రకాశ్ గౌడ్ జన్మదినం జరిగినప్పుడు కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను వారం రోజుల పాటు తొలగించలేదని గుర్తు చేశారు. దేశ ప్రధాని ఫోటోతో ఉన్న ఫ్లెక్సీలను అధికారులు తొలగించి తప్పు చేశారన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.



రాజేంద్రనగర్ నుంచి పెరేడ్ గ్రౌండ్ లో జరిగిన ప్రధాని సభకు వెళ్తున్న బీజేపీ నాయకులు వై శ్రీధర్ తదితరులు

## ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సభకు తరలివెళ్లిన రాజేంద్రనగర్ నాయకులు

**బుద్వేల్, మే 10 (ప్రభాత ఉదయం)**

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభకు సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్స్ కు రాజేంద్రనగర్ నుండి భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు బయలుదేరి బస్సులో వెళ్లడం జరిగింది ఈ కార్యక్రమంలో గోల్కొండ గోషామహల్ ఇన్చార్జ్ శ్రీధర్ డివిజన్ మాజీ అధ్యక్షులు జి బాబురావు డివిజన్ ఉపాధ్యక్షులు పవన్ రాజ్ డివిజన్ కార్యదర్శి కవిత జిల్లా ఎస్సీ మోర్చా కార్యదర్శి గుడిసె యాదయ్య జిల్లా ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యులు పి రవీందర్ ప్రధాన కార్యదర్శి ఇ. వేణుగోపాల్ సీనియర్ నాయకులు జ్ఞానేశ్వర్ కిరణ్ రమణ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడాలి

### పుస్తకాల నర్సింగ్ రావు

**బుద్వేల్, మే 10 (ప్రభాత ఉదయం)**




సీపీఐ నాయకులతో పుస్తకాల నర్సింగ్ రావు

సీపీఐ పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల కార్యకర్తలు నిరం తం పేద ప్రజల సమస్యలపై పోరాడాలని ఆ పార్టీ కంట్రోల్ కమిషన్ సభ్యులు, రంగారెడ్డి జిల్లా మాజీ కార్యదర్శి పుస్తకాల నర్సింగ్రావు అన్నారు. ఆదివారం బుద్వేల్ లోని సీపీఐ రాజేంద్రనగర్ మండల కార్యాలయంలో మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి అధ్యక్షతన 18శాఖల సీపీఐ కమిటీ అధ్యక్షులు, కార్యదర్శులనుద్దేశించి ఆయన మాట్లాడారు. మూడు నెలల కొకసారి పార్టీ శాఖల సమావేశాలు నిర్వహించుకోవాలన్నారు. ఏఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్ మహ సభలను నిర్వహించాలన్నారు. అర్హులైన నిరుపేదలందరికి ప్రభుత్వం ద్వారా డబుల్ బెడ్ రూమ్లు ఇప్పించే విషయంపై పార్టీ ముందుండి పనిచేయాలన్నారు. అవసరమైతే ధర్నాలు, నిరసనలు చేపట్టి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ పార్టీ నాయకులు జి సత్యం, జె సదానంద్ గౌడ్, సయ్యద్ ఖాజ, పాండు, సాబేర్, హుస్సేన్, పుష్ప, శాంతమ్మ, స్వరూప, వాణి, క్రిష్ణ, ఖాజ, ప్రతాప్ రెడ్డి, నవీన్ కుమార్, చారి తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరాలు సమాజ ఆరోగ్యానికి వరం

### సామాజిక బాధ్యతతో ప్రతి ధనవంతుడు సమాజ సేవలో భాగస్వామి కావాలి

### కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్

**కూకట్ పల్లి, మే 10 (ప్రభాత ఉదయం)**



కూకట్ పల్లి నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలకు మరోసారి శ్రీకారం చుట్టిన టీపీసీసీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ సమాజంలో ఆర్థికంగా ఎదిగిన ప్రతి వ్యక్తి తన వంతు సామాజిక బాధ్యతగా పేద ప్రజలకు సేవ చేయాలనే దృక్పథం కలిగి ఉండాలని పేర్కొన్నారు. యశోద హాస్పిటల్ (హైటెక్ సిటీ) సౌజన్యంతో కాంగ్రెస్ పార్టీ నాయకుడు మండల సాయిబాబ చౌదరి ఆధ్వర్యంలో ఆదివారం వసంత్ నగర్ డివిజన్ పరిధిలోని సర్దార్ పటేల్ నగర్లో ఘనంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బండి రమేష్ శిబిరాన్ని ప్రారంభించి ప్రజలతో మమేకమయ్యారు. అనంతరం ఆయన స్వయంగా పలు ఆరోగ్య పరీక్షలు చేయించుకుని ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. సుమారు 350 మందికి పైగా ప్రజలకు వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సూచనలు, సలహాలు అందజేశారు. రక్తపోటు, షుగర్, గుండె సంబంధిత సమస్యలు, సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన మందులను కూడా అందించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ ప్రస్తుతం మారుతున్న జీవనశైలి కారణంగా అనేక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. అలాంటి పరిస్థితుల్లో ప్రజలు తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవడం చాలా అవసరం. ముందస్తు జాగ్రత్తల ద్వారా అనేక వ్యాధులను తొలి దశలోనే గుర్తించి నివారించవచ్చు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి" అని అన్నారు. ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ఉపయోగకరమని, సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న యశోద హాస్పిటల్ యాజమాన్యాన్ని, కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించిన మండల సాయిబాబ చౌదరిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, గాలి బాలాజీ, గంధం రాజు, కొప్పిశెట్టి దినేష్ కుమార్, సాయి తులసి, వాసు తదితరులు పాల్గొని శిబిరం విజయవంతానికి సహకరించారు.



## ప్రజల్లోనే నాయకత్వానికి అసలైన గుర్తింపు

### టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్

**కూకట్ పల్లి, మే 10 (ప్రభాత ఉదయం)**

నిరంతరం ప్రజల మధ్య ఉండి వారి కష్టసుఖాల్లో భాగస్వామ్యం అవుతూ, సమస్యల పరిష్కారం కోసం అంకితభావంతో పనిచేసే నాయకుడికే సమాజంలో గౌరవం, గుర్తింపు లభిస్తాయని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. ఆదివారం బేగంపేట డివిజన్ అధ్యక్షుడు రమేష్ ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని బండి రమేష్ స్థానిక నాయకులతో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అదే రోజు డివిజన్ అధ్యక్షుడు రమేష్ జన్మదినోత్సవం కావడంతో బండి రమేష్ ఆయనకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ పట్ల ఆయన చూపుతున్న నిబద్ధత, సేవాభావం ప్రశంసనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా మాట్లాడిన బండి రమేష్, దేశ ప్రజలందరికీ సమాన హక్కులు, స్వేచ్ఛ, సామాజిక న్యాయం కల్పించేలా భారత రాజ్యాంగాన్ని రచించిన భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గొప్ప దార్శనికుడు అని కొనియాడారు. సమాజంలో వెనుకబడిన వర్గాలకు అండగా నిలిచిన అంబేద్కర్ ఆశయాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. ఇటీవల దళితరత్న అవార్డులు అందుకున్న ప్రముఖులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీకి బలమని అన్నారు. సుదీర్ఘకాలంగా పార్టీని అంటిపెట్టుకుని ప్రజాసేవలో ముందుండే బేగంపేట డివిజన్ అధ్యక్షుడు రమేష్ సేవలు అభినందనీయమని బండి రమేష్ పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు మరింత చేరువగా ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గాలి బాలాజీ, శ్రీనివాసరెడ్డి, కొప్పిశెట్టి దినేష్, గంధం రాజు, కరుణాకర్, సురేష్, పర్వేజ్, అలీ భాయ్, భరత్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మంద కృష్ణ మాదిగ ను కలసిన డాక్టర్ ఆర్ ఎస్ ప్రసన్న కుమార్ తదితరులు

## పీ వీ నర్సింహ్మా రావు పశు వైద్య విశ్వవిద్యాలయంలో మాదిగలకు జరుగుతన్న అన్యాయాలపై మాట్లాడాలి

**బుద్వేల్, మే 10 (ప్రభాత ఉదయం)**

పీవీ నర్సింహ్మారావు తెలంగాణ రాష్ట్ర పశువైద్య విశ్వవిద్యాలయం లో మాదిగ లకు జరుగుతున్న అన్యాయాల గురించి మాట్లాడటానికి వర్సిటీ కి రావాలని కోరుతు ఆదివారం వర్సిటీ శాస్త్రవేత్తలు, ఉద్యోగులు, ఎమ్మార్పీఎస్ నాయకులతో కలసి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మంద క్రిష్ణ మాదిగ ను కలసి విన్నవించుకున్నారు. దానికి మంద క్రిష్ణ మాదిగ సానుకూలంగా స్పందించారు. మంద క్రిష్ణ మాదిగ ను కలసిన వారిలో ఎమ్మార్పీఎస్ నాయకులు వనం నర్సింహ్మా మాదిగ, వర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ ఆర్ ఎస్ ప్రసన్న కుమార్ లు ఉన్నారు.



## పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

**గద్వాల జిల్లా ప్రతినిధి,మే 10(ప్రభాత ఉదయం)**

పాత జ్ఞాపకాలు చిగురించాయి.. చిన్ననాటి స్నేహితుల పలకరింపులతో ఆ ప్రాంగణం పులకించిపోయింది. గద్వాల పట్టణంలోని ఒక ప్రైవేట్ బ్యాంకెట్ హాల్‌లో ఆదివారం శ్రీ రవీంద్ర ఉన్నత పాఠశాల 1996-97 విద్యా సంవత్సరం పదవ తరగతి పూర్వ విద్యార్థుల, ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం అట్టహాసంగా నిర్వహించారు. సుమారు 29 ఏళ్ల తర్వాత తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఒకే వేదికపై కలుసుకోవడం అందరినీ భావోద్వేగానికి గురిచేసింది. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి, వారి ఆశీస్సులు తీసుకున్నారు. తమ ఎదుగుదలలో ఉపాధ్యాయుల పాత్ర మరవలేనిదని కొనియాడారు. పలు ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులందరూ ఒక్కచోట చేరి తమ చిన్ననాటి అల్లరిని, పాఠశాల రోజులను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుత ఉద్యోగ, వ్యాపారాల గురించి ఒకరికొకరు పంచుకుంటూ రోజంతా సందడిగా గడిపారు. ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి, జ్ఞాపికలతో గౌరవించడం. పాత మిత్రులతో కలిసి గ్రూపు ఫోటోలు దిగడం, సెల్ఫీలతో సందడి చేయడం. సహపంక్తి భోజనాలు చేసి, పాత జ్ఞాపకాలను నెమరువేసుకోవడం. ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టర్ హనుమంతు, పిఈటీ ప్రభాకర్, ఉపాధ్యాయులు రామస్వామి వెంకట్ రాములు చిన్న రాములు యుగేందర్ రెడ్డి జాన్ పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608